క్లుప్తంగా

పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

చిగురుమామిడి: మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇల్లందుల సంపత్ కోరారు. శుక్రవారం చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు పార్టీలో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలతోనే భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు గోపు గోవర్ధన్‌రెడ్డి, నీల రవికుమార్, జానబోయిన మహేందర్, లైబ్రేరియన్ చంద్రశేఖర్, అనిత, మమత, స్వరూపరాణి, కవిత, జూనియర్ అసిస్టెంట్ వలీబాషా, ఆఫీస్ సబార్డినేట్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న రామాంజనేయ ఆలయానికి అదే గ్రామానికి చెందిన గంధం లక్ష్మణ్‌రజిత దంపతులు రూ.లక్ష విరాళం మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డికి అందించారు. అదేవిధంగా అంబాలపూర్ గ్రామానికి చెందిన తుమ్మేటి నారాయణరెడ్డి రూ.యాభైవేలు అందించగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పల్లెర్ల కిరణ్, బాలస్వామి, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి ఉన్నారు.

యూత్ ఎక్చేంజ్ ప్రోగ్రాంకు ఎంపిక

వీణవంక: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ గుజరాత్ ఆధ్వర్యంలో జరిగే బోర్డర్ ఏరియా యూత్ ఎక్చేంజ్ ప్రోగ్రాంకు మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దూలం సురేశ్ ఎంపికయ్యాడని జిల్లా యువజన అధికారి వెంకటరాంబాబు తెలిపారు. ఇండియా–పాకిస్తాన్ బోర్డర్‌లోని కచ్‌లో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు కార్యక్రమం ఉంటుందని, తెలంగాణ నుంచి ఆరుగురు ఎంపిక కాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి సురేశ్ ఎంపికవ్వడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సురేశ్ యువ చైతన్య యూత్ క్లబ్ సభ్యుడిగా పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా సురేశ్‌ను క్లబ్ అధ్యక్షుడు కర్రె నాని, గ్రామస్తులు అభినందించారు.

బీజేపీ నాయకుల ప్రచారం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు మద్దతుగా బీజేపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ, చిగురుమామిడి గ్రామాల్లోని టీచర్స్‌ను కలిసి కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎం. అంజయ్యయాదవ్, మండల ఇన్‌చార్జి అచ్చ రవీందర్, సహఇన్‌చార్జీలు పైడిపెల్లి శ్రీనివాస్, కంది శంకర్ పలువురు పాల్గొన్నారు.

స్యాండ్ టాక్స్ ఏర్పాటు చేయండి

తిమ్మాపూర్: ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాం. స్యాండ్ ట్యాక్స్ ఏర్పాటు చేయండి అంటూ జిల్లా మైనింగ్ అధికారికి రేణికుంట గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగులో గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో స్యాండ్ టాక్స్ నిర్వహించారని అప్పుడు ప్రత్యక్షంగా, పరోక్షంగా ట్రాక్టర్లు, డ్రైవర్లు, కూలీలు గ్రామానికి చెందిన ఎంతోమంది ఉపాధి పొందారని, స్యాండ్ టాక్స్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. తమ్మనవేణి శ్రీనివాస్, గుంతక మహేశ్, కుంభం శ్రీకాంత్, ఎలక సుమన్, హరీశ్ కలిసినవారిలో ఉన్నారు.

బీఆర్ఎస్, బీజేపీతో నిరుద్యోగులకు అన్యాయం

జమ్మికుంట: బీఆర్ఎస్, బీజేపీ నిరుద్యోగులకు అన్యాయం చేశాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పట్టభద్రుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. ప్రభుత్వం వేల ఉద్యోగాల భర్తీ చేపట్టిందని, కలిసి కట్టుగా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేశవపట్నంలో కొండచిలువ సంచారం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట శుక్రవారం రాత్రి కొండచిలువ సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కేశవపట్నం– కరీంపేట రోడ్డుపై నుంచి కొండచిలువ వెళ్తుండగా వాహనదారులకు కనపించింది. తరచూ పాములు జనావాల మధ్యలోకి వస్తున్నాయని ఓ వైపు పాఠశాల, మరోవైపు ఆశ్రమం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

- అవస్థలు పడుతున్న ప్రజలు
- ప్రయాణానికి వెనకడుగు వేస్తున్న వైనం



చొక్కారావుపల్లె- ఖాసీంపేట మధ్య రోడ్డు దుస్థితి



వర్షాకాలంలో(ఫైల్)

గన్నేరువరం: మండలంలోని అంతర్గత రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయి. గత వర్షాకాలంలో కురిసిన వానలకు రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. దీంతో ఈ దారులపై వాహనదారులు వెళ్లాలంటే జంకుతున్నారు. మండలం ఏర్పాటు నుంచి దారుల పరిస్థితి ఇంతేనని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

- జంగపల్లి – మాదాపూర్ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. వివిధ గ్రామాలకు చెందిన వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు వెంబడి మండలకేంద్రం గన్నేరువరం వైపు, ఇటు గుండ్లపల్లి, కరీంనగర్ వైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారి మరమ్మతుల సంగతిని ప్రజాప్రతినిధులు, అధికారులు మరిచిపోయారు.
- ఖాసీంపేట ఎక్స్‌రోడ్డు నుంచి చొక్కారావుపల్లె గ్రామానికి వెళ్లే దారికి ఇరువైపులా ముళ్లపొదలతోపాటు ఒర్రె ఉంటుంది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రమాణం ప్రమాదకరం, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ఖాసీంపేట, పారువెల్ల గ్రామాల్లోని శ్రీమానసాదేవి, శ్రీలక్ష్మీగణపతి ఆలయాల దర్శనం కోసం బోయినిపల్లి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన భక్తులు తరలివస్తుంటారు. పారువెల్ల పెద్ద చెరువు అలుగు పారిదంటే రాకపోకలు నిలిచిపోతాయి.
- మండలకేంద్రం నుంచి మైలారం రోడ్డు అభివృద్ధికి నిధులను మంజూరు చేశారు. కానీ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పీచుపల్లి–జంగపల్లి, ఖాసీంపేట–మాదాపూర్, మాదాపూర్– మైలారం గ్రామాల మధ్య రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

నూతన గ్రామ పంచాయతీలదీ అదే తీరు

నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడిన యాస్వాడ, చాకలివానిపల్లె గ్రామాల రోడ్ల అభివృద్ధిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ పల్లెలకు బీటీ రోడ్లు లేవు, యాస్వాడ గ్రామ సమీపంలో డిస్ట్రిబ్యూటర్ 9 ఉపకాల్వలకు నీరు విడుదల చేస్తే నీరంతా రోడ్డుపైకి వచ్చినప్పుడు బురదమయంగా తయారవుతోంది. బీటీ రోడ్లు నిర్మించి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఖాసీంపేట ఎక్స్ రోడ్డు నుంచి మైలారం, పంతుళ్ల కొండాపూర్, హన్మాజిపల్లె గ్రామాల మీదుగా జంగపల్లి ఎక్స్ రోడ్డు వరకు, గన్నేరువరం నుంచి ఖాసీంపేట వరకు ఉన్న బీటీ రోడ్లు గుంతలతో అధ్వాన్నంగా మారాయి. కనీసం ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇవే కాక పలు ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి అంతే.

బీటీ రోడ్లుగా మార్చాలి



అంతర్గత రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. గ్రామాల అభివృద్ధికి అంతర్గత రోడ్లు ఎంతో ముఖ్యం, ప్రజల సౌకార్యానికి ప్రధానమైనవి. మండలం ఏర్పాటు నుంచి దారులకు మోక్షం కల్గడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెలకు బీటీ రోడ్లు వేయించాలి.

– చొక్కాల శ్రీశైలం, చొక్కారావుపల్లె

అధికారులకు నివేదించాం

ఖాసీంపేట–చొక్కారావుపల్లె గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి గతేడాది ప్రపోజల్స్ పంపించాం. అంతర్గత రోడ్ల అభివృద్ధి పనుల కోసం సంబంధితశాఖతో పాటు ఉన్నత అధికారులకు నివేదించాం. గునుకులకొండాపూర్, ఖాసీంపేట, పారువెల్ల గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ఇటీవల నిధులు మంజూరయ్యాయి.

– స్నేహజ్యోతి, పంచాయతీరాజ్, ఏఈ, గన్నేరువరం



జమ్మికుంట: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేశ్



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుహాసిని, లెక్చరర్లు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌బి.రమేశ్ అధ్యక్షతన, తెలుగు విభాగం అధ్యాపకురాలు శ్యామల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాతృభాషలో విద్యాబోధన సమాజ పురోగతికి దోహదపడుతుందని, తెలుగు భాషా ఔనత్యాన్ని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదేలుకుమార్, అకాడమీ కోఆర్డినేటర్ రాజేంద్రం, స్టాఫ్ సెక్రెటరీ గణేశ్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, మాధవి, ఉమాకిరణ్, రాజ్‌కుమార్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రవిప్రకాశ్, సుష్మ, శ్రీనివాస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణానికి చెందిన కవి, కైతికాల సృష్టికర్త గొస్కుల రమేశ్‌ను మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. శుక్రవారం హన్మకొండలోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం, కవితారచన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు కవులు తెలుగు కవితల గూర్చి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని, తెలుగు విభాగాధిపతి ఎస్.మధు, తెలుగు విభాగ అధ్యాపకుడు మధు, లక్ష్మీకాంతం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.సురేష్ బాబు, అకడామిక్ కో ఆర్డినేటర్ డా.ఎం. అరుణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ సీటును గెలిపించుకుందాం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ సిట్టింగ్ సీటును గెలిపించుకుందామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కేశవపట్నంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నరేందర్‌రెడ్డి విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వేల మందికి ఉపాధి కల్పించారని, లక్షలాది మంది విద్యార్థులకు విద్యనందించారని పేర్కొన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారి అంజిరెడ్డి నాలుగు జిల్లాల్లో విద్యార్థులకు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందనే తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తిప్పికొట్టాలని సూచించారు. కేసీఆర్ కుటుంబంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, వైద్యవృత్తిని వదిలి ఏళ్లుగా పోరాడి ఎమ్మెల్యే అయ్యాయనని, తనకు ఏవరితో విభేదాలు లేవన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాబోయే స్థానిక సంస్థలపై ప్రభావం చూపుతుందన్నారు. నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో రూ.5 కోట్ల పనులు జరిగాయని గుర్తిచారు. రెండు వారాలుగా సామాజిక తనిఖీ బృందం అధికారులు గ్రామాల్లో పర్యటించి తనిఖీ నిర్వహించగా కొలతల్లో తేడాలను గుర్తించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ మాట్లాడుతూ... పనులలో వచ్చిన తేడాలను గుర్తించటం జరిగిందని, నగదు రికవరీకి ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణ, క్వాలిటీ కంట్రోల్ అధికారి సునీల, ఎంపీడీవో సునీత, ఎంపీవో సతీష్, ఏపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ బెస్త గంగపుత్ర సంఘం కరీంనగర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే గంగమ్మ బోనాలను విజయవంతం చేయాలని సంఘం పట్టణ అధ్యక్షుడు పావన కృష్ణ తెలిపారు. శుక్రవారం జ్యోతినగర్‌లోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. ఉదయం 11గంటలకు బోనాలు, 12 గంటలకు కల్యాణం, సాయంత్రం 4 గంటలకు తెప్పోత్సవం, 6గంటలకు గంగాహారతి నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలోని బెస్త కులానికి చెందిన మహిళలు, కులస్తులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మరాజ్, రాజన్న, లక్ష్మీనారాయణ, పట్టణ నాయకులు సత్యనారాయణ,విశ్వప్రకాశ్, జనార్దన్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, పద్మ కనకరాజ్, నాయకులు కిషన్, ఆనందం, ఆనంద్, సత్తయ్య, పురుషోత్తం, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

క్రైం వార్తలు

స్కూటీకి అడ్డుగా వచ్చిన అడవి పంది

సీఆర్‌పీ వనితకు తీవ్ర గాయాలు

గన్నేరువరం: ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అడవిపంది అడ్డం రావడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని బొమ్మకల్ చెందిన గాలిపెల్లి వనిత మండలంలో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తోంది. విధుల నిమిత్తం శుక్రవారం గుండ్లపల్లి స్టేజీ నుంచి పారువెల్ల గ్రామానికి స్కూటీపై వెళ్లుతుండగా జంగపల్లి క్రాసింగ్ సమీపంలో రోడ్డు పక్కన మామిడితోటలో నుంచి అడవిపంది అకస్మాత్తుగా దూసుకొచ్చి ఢీ కొట్టింది. కింద పడిన వనిత తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గ్రహించిన హన్మాజిపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వద్దకు తీసుకువచ్చారు. సహచార సీఆర్‌పీ రమేశ్ ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన గజవేన శ్రీకాంత్ ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేయడంతో పాటు కులం పేరుతో దూషించగా బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ఏడాదిగా ప్రేమిస్తున్నానని వెంట పడటంతో పాటు నమ్మిచ్చి వేములవాడకు తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. రెండు రోజులుగా కాపురానికి తీసుకెళ్లకుండా శ్రీకాంత్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో మహిళ తన భర్త ఇంటికి వెళ్లింది. ఆమె భర్త శ్రీకాంత్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు బూతులు తిడుతూ కులం పేరుతో దూషించారని, ఇంటి నుంచి గెంటేశారని ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

మహిళా ఆత్మహత్యాయత్నం

ఇల్లందకుంట: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను ఆధునిక టెక్నాలజీ సాయంతో గంట వ్యవధిలో పోలీసులు కాపాడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన పల్లెర్ల రుచిత అదే గ్రామానికి చెందిన అరవింద్‌ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. రెండు నెలలుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా రుచిత తల్లిగారింటికి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చనిపోతున్నానంటూ తల్లికి ఫోన్ చేసి పది నెలల పాపతో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని సంప్రదించినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి నక్క సువర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఎస్సై రాజ్‌కుమార్ రుచిత మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా జమ్మికుంట మండలం పెద్దంపేట గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు సమయస్ఫూర్తితో ప్రాణాపాయం తప్పింది. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. రెండు ప్రాణాలను కాపాడిన ఇల్లందకుంట పోలీసులను ఉన్నతాధికారులు, ఏసీపీ శ్రీనివాస్, సీఐ కిషోర్ అభినందించారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

జమ్మికుంట: కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపిన వివరాలు ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన మర్రి తిరుపతిరెడ్డి జమ్మికుంట పట్టణంలో కూరగాయలు అమ్ముకోవడానికి బైక్‌పై వచ్చాడు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మోట్లపల్లి గ్రామానికి చెందిన సామల ప్రతాప్‌రెడ్డి అజాగ్రత్తగా కారు నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో తిరుపతిరెడ్డి తల, కాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి మేనల్లుడు కనుకుల కిరణ్ ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి శుక్రవారం తెలిపారు. మండలంలోని శంభునిపల్లి గ్రామానికి చెందిన రాచపల్లి రాజు, విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి కుమారస్వామి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పటుకొని కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

క్యూలో ఉన్నా యూరియా దొరకడం లేదు



చిగురుమామిడి సింగిల్‌విండో కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతుల వరుస

చిగురుమామిడి: మండలంలో యూరియా కోసం పదిహేను రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులకోసారి చిగురుమామిడి సింగిల్‌విండో కార్యాలయం ఎదుట క్యూ కడుతున్నారు. సింగిల్‌విండో సిబ్బంది ప్రతి రైతుకు మూడు నుంచి నాలుగు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. యూరియా వచ్చిన ప్రతిసారి రైతులు క్యూ కడుతున్నప్పటికీ ముందు వరుసలో ఉన్న వారికి మాత్రమే బస్తాలు అందుతున్నాయి. గత పదిరోజుల్లో కేవలం 80 టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. కానీ మండలంలో దాదాపు పదివేల మంది రైతులున్నారు. 80 టన్నుల యూరియాను ఇందుర్తి, రేకొండ గ్రామాల్లో పాయింట్లు ఏర్పాటు చేసి 40 టన్నులు అక్కడి తరలించారు. ఆయా గ్రామాల రైతులు అక్కడ నుంచి తెచ్చుకోగా సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారా అనే సందేహాలు కూడా రైతులనుంచి వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో యూరియా కొరత లేదని, ఇప్పటికైనా జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డిని వివరణ కోరగా జిల్లా నుంచి వచ్చిన ప్రతి యురియా బస్తాను రైతులకే పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

వదంతులు నమ్మొద్దు

జమ్మికుంట: యాసంగికి అవసరమైన యూరియా నిల్వలున్నాయని, స్టాక్ లేదనే వదంతులు నమ్మొద్దని ఏవో ఖాదర్ హుస్సేన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మూడు సహకార సంఘాల పరిధిలో సరిపడా యూరియా 30 టన్నుల వరకు ఉందని, శనివారం వరకు వంద టన్నులు అందుబాటులోకి వస్తుందన్నారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయొద్దని, దశలవారీగా అందుతుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆరోగ్య మహిళా



పోషక పదార్థాలను పరిశీలిస్తున్న అధికారి

చొప్పదండి: మహిళల సమస్యలకు శుక్రవారం సభ పరిష్కారం చూపిస్తోందని జిల్లా మహిళా సంక్షేమ అధికారి సబతి అన్నారు. మండలంలోని రుక్మాపూర్‌లో నిర్వహించిన శుక్రవారం సభకులో మాట్లాడారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా సుమారు 50 రకాల పరీక్షలు మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్నామని, అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతో పాటు పిల్లల సృజనాత్మకత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, అడిషనల్ డీఎంహెచ్‌వో సనా, సీడీపీవో కస్తూరి, నర్సింగరాణి, రాజగోపాల్ రెడ్డి, విజయలక్ష్మి, అరుణ, శశికుమారి, రేణుక, డీసీపీవో పర్వీన్, సంపత్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్, కన్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రావణి సూచించారు. ఆకుకూరలు, పప్పుదినుసుల ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



గంగాధర: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ విద్యాలయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, ముప్పై ఏళ్లుగా విద్యారంగంలో సేవలు చేస్తున్న నరేందర్‌రెడ్డికి పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ప్రచారంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత–శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు పురమల్ల మనోహర్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి మహేందర్, పడితపల్లి కిషన్, కోల ప్రభాకర్, చందు, చిప్ప చక్రపాణి ఉన్నారు.

కాంగ్రెస్‌పార్టీతోనే పట్టభద్రులకు న్యాయం

గంగాధర: కాంగ్రెస్ పార్టీతోనే పట్టభద్రులు, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి అలువాల కార్తీక్ అన్నారు. మండలంలోని మధురానగర్ పార్టీ ప్రజాకార్యాలయంలో మాట్లాడారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న బీజేపీకి ఓటేస్తే బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని, విద్యాసంస్థలను స్థాపించి వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందించిన నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని సూచించారు. వెంట నాయకులు శంకర్, హొడ్నాల యగ్నేశ్, గోల్కొండ పర్శరాం, సతీశ్‌రెడ్డి, నల్లల అఖిల్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెదిర, పందికుంటపల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో నాయకులు జవ్వాజి హరీశ్, వెన్నెం రాజమల్లయ్య, కోల రమేశ్, ఒంటెల మురళీకృష్ణారెడ్డి, పిండి సత్యం, వంచ సుదర్శన్ రెడ్డి, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.సంతోష్‌రెడ్డి, నేరెళ్ల ఆంజనేయులు, మారుతి, నారాయణస్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాల్లో డ్రోన్ల వాడకం

- పంటలపై క్రిమిసంహారక మందు పిచికారీ
- రైతులకు తప్పిన కూలీల భారం

కరీంనగర్‌రూరల్: పంటల సాగులో అందివచ్చిన ఆధునిక సాంకేతికను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వరిపంటకు ఆశిస్తున్న వివిధ తెగుళ్లను నియంత్రించేందుకు డ్రోన్లతో క్రిమిసంహారక మందులను పిచికారీ చేయిస్తున్నారు. కూలీల భారం తగ్గడంతో పాటు డబ్బులు తక్కువ కావడంతో పలువురు రైతులు డ్రోన్ల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. కరీంనగర్‌కు చెందిన ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు డ్రోన్లను అద్దెకు ఇస్తూ ఆదాయం పొందుతున్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్‌లో రైతులు పడాల తిరుపతి 3 ఎకరాలు, దామరపల్లి రాఘవరెడ్డి 2, పి. రవి 4 ఎకరాల్లోని వరిపంటపై డ్రోన్‌తో క్రిమిసంహారక మందును పిచికారీ చేయించారు. ఎకరానికి రూ. 500 చొప్పున రైతుల నుంచి అద్దెను వసూలు చేశారు. కేవలం 15 నిమిషాల్లో 3 ఎకరాల్లో మందును పంటపై పిచికారీ చేసినట్లు రైతు తిరుపతి తెలిపారు. ఎకరానికి కూలీలతో మందు పిచికారీ చేయాలంటే ఇద్దరు కూలీలకు రూ.1200 వరకు చెల్లించాల్సి వస్తోంది. డ్రోన్‌తో రూ. 500 పని పూర్తవుతుందని వివరించారు.

వైద్య శిబిరం

కరీంనగర్‌సిటీ: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో లాలాపాత్ ల్యాబ్ అకాడమీ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. బ్లడ్ గ్రూప్, బీపీ, ఆరోగ్య పరీక్షలు చేశారు. వైస్ ప్రిన్సి పాల్ జి.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.